


# అన్నానా?? ఏమనీ??

పొద్దున తొమ్మిది కొట్టేసరికి మా ఇల్లు చాలా సందడిగా ఉంటుంది. మా పెద్ద తాతగారూ, ఆయన స్నేహితుడు మరో తాతగారూ స్నానాదికాలు ముగించి ముందు హాల్లో జేరతారు. మా ఎదురిల్లే వారిది.

వాళ్ళిద్దరూ వరుసకు బావా బామ్మరుదులుట. నువ్వంటే నువ్వు అనుకోవచ్చును గానీ అలా అనుకుంటే అగౌరవం అని మీరనే అనుకుంటారు. బాగా మాట్లాడుకుంటూనే మధ్యలో పోట్లాడుకుంటారు కూడా. ఇద్దరికీ ఎనభై దాటింది. వినికిడి శక్తి బాగా తగ్గిపోయింది. ఆవార వాగ్దాటి బాగా పెరిగింది. ఏవిటేవిటో విషయాలమీద గంటలకొద్దీ మాట్లాడుకొనేవారు.

బ్యాడ్మింటను కోర్టంత ఉన్న హాల్లో చెరోమూలా కూర్చుని ధారళంగా మాట్లాడుకుంటారు.

"ఏవిటో ఒకటే తాపత్రయపడిపోయి చావుతన్నులు తిని తీసుకొచ్చారు స్వాతంత్ర్యం. ఏం ఒరిగిందిటా? ?" అని మా తాతగారు అంటే–

"కష్టాలు చెప్పిరావు. పాపం మా గరికపాటి బాలమ్మకు 'కిందటి ఏడాది భర్త వియోగం, ఇప్పుడు పుత్రశోకం. ఎలా తట్టుకుంటుందో ఏమో" అంటారు ఆ తాతగారు.

"ప్రకాశం బేరేజీకి ప్రకాశంగారి పేరే ఎందుకు పెట్టాలని గొడవ చేశాడుట ఓ ప్రబుద్ధుడు. సిగ్గులేకపోతే సరి. ఆయన్లాటి ప్రజాహితుడూ, పరోపకారీ మరొకరున్నారా? అటువంటివాడు మన తెలుగు వాడవడం మనందరికీ గర్వకారణం. ఆ మహానుభావుడి పేరుపెడితే ఆ క్రిష్ణవేణమ్మ తల్లి పులకించిపోయి ఏడాదిపొడుగునా నిండుగా పారుతుంది" అని మా తాతగారు.

"కందిపప్పు మాత్రం చవగ్గా వస్తోందా? పదిరూపాయలకి పట్టుమని పది వీశలైనా రాకపోతే మనం ఏం తిని బతుకుతాం చెప్పండి" అని ఈ తాతగారు.

వీళ్ళ గొడవకి విసిగిపోయి-"ఏమిటండీ మీ గొడవ? ఒకరు చెప్పేది ఇంకొకరికి వినిపించదు" అని ఏ బాబాయో విసుక్కుంటే-

"చాల్లే! గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట. పెద్దవాళ్ళం కష్టం సుఖం మాట్లాడు కుంటూ ఉంటే పిల్లవెధవలు వినవచ్చునా? తప్పుకాదూ!" అని మందలిస్తారు మా తాతగారు.

"మీ మాటలు బజారుదాకా వినిపిస్తుంటే వినక ఛస్తామా?"అంటాడు ఆ బాబాయ్ విసుగ్గా.

"అయితే ఒరే! మా వినికిడి సామర్థ్యంలో ఏమైనా తేడా కనిపిస్తోందా?" అంటారు తాతయ్య.

"తేడా ఏమిటి మామయ్యా...పూర్తిగా పోయింది" అంటాడు బాబాయ్.

అతను వెళ్లేదాకా ఊరుకుని లేచి దగ్గరగా వచ్చి "బావగారూ! మనకు వినిపించడం లేదుట. అయితే ఇక వృద్ధాప్యం వచ్చినట్లే అంటారా?" అని అడుగుతారు ఆయన.

"వచ్చినా ఆ మాట ఒప్పుకోకూడదు మనం. బింకంగా ఉండాలి. లేకపోతే మనమాట లక్ష్యం చెయ్యరు. ఇప్పటికే మనకు చెప్పకుండా సినేమాలకీ షికార్లకీ పోతున్నారు-చూస్తున్నారుగా" అని చెప్తారు మా తాతగారు.

"నిజమే సుమా! బావగారూ...మన పెద్దరికం నిలబెట్టుకోవాలంటే మనం బింకంగా ఉండాలి" ఒప్పుకున్నారు ఆ తాతగారు.

చాలా రహస్యంగా మాట్లాడుకుంటున్నామని వాళ్ళు అనుకున్నా, ఇంట్లో అందరికీ వినిపించింది ఆ సంభాషణ.

ఆ రోజుల్లోనే మా బావగారు పండక్కి వచ్చారు. మా బావగారిది పై సంబంధం. ఆయనకి బుద్ధి తెలిసేసరికి ఆయన తాతయ్యలందరూ పైకి వెళ్ళిపోయారు. అందుకే

ఆయనకి తాతయ్యలంటే అపరిమితమైన భక్తి ప్రపత్తులూ, వినయవిధేయతలూనూ. మొదటి పండగ.

స్నానంచేసి హాల్లోకి వచ్చారు బావగారు.

అప్పటికే మా తాతయ్యలిద్దరూ దర్బారు తీర్చారు.

ఇద్దరిమధ్యా ఓ కుర్చీలో కూర్చుని ఇద్దరికీ వినయంగా నమస్కారం చేశారు బావగారు.

"ఏం నాయనా! స్నానం అయిందా?" పలకరించారు మా తాతగారు.

"అయిందండీ" వినయంగా సమాధానం చెప్పారు బావగారు.

"ఏవిటి నాయనా! బావగారు అడుగుతున్నారు?" అడిగారు ఆ తాతయ్య.

"స్నానం అయిందా అని అడిగారండీ!" మళ్ళీ మర్యాదగా చెప్పారు బావగారు.

"ఏవిటి బాబూ! బావగారు అంటున్నారు?" తాతయ్య ప్రశ్న.

"మీరేం అడిగారా అని అడిగారండీ" తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో బావగారి సమాధానం.

"ఏవిటయ్యా బావగారంటున్నారూ? ?" ప్రశ్న.

"అబ్బే ఏం లేదండీ! మీరేం అడిగారా అనీ?" నీరసంగా సమాధానం.

"ఆఁ ఏవిటబ్బాయ్! ఏవిటంటున్నారు మా బావగారు."

"శ్రీ రామచంద్రా! ఏంలేదండీ. మీరేం అడిగారా అని" కొనఊపిరితో బావగారి సమాధానం.

పావుగంట గడిచింది. లేవాలని ప్రయత్నించినా వాళ్ళు లేవనివ్వడం లేదు. బావగారికి దుఃఖం తన్నుకొస్తోంది. అదే గొడవ.

ఆయన్ని రక్షించడానికా అన్నట్లు వచ్చింది మా అక్కయ్య. ఈ వ్యవహారం అంతా చూసి 'ఇటు రండి. అట్లా బజారుకో, గుడికో వెళ్దాం' అని పిలిచింది.

బతుకుజీవుడా అని లేచి "ఆఁ ఏవిటి నాయనా! అమ్మాయి అంటోంది?" అని వాళ్ళు అడుగుతున్నా వినిపించుకోకుండా పారిపోయారు.

"కలికాలం కాకపోతే పట్టపగలు భర్తతో మాట్లాడ్డానికి ఎంత ధైర్యం?" అన్నారు మా తాతగారు.

"ఆ మాటకొస్తే భట్టిప్రోలువారుకూడా గట్టివాళ్ళే" అన్నారు ఆ తాతగారు.

* * *